ఉచిత మెడికల్ క్యాంప్

జగద్గిరిగుట్ట: మదర్ థెరిస్సా జయంతిని పురస్కరించుకుని సోమవారం మల్లారెడ్డి ఆసుపత్రి సౌజన్యంతో హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో జగద్గిరిగుట్టలో ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ జగన్ ముఖ్యఅతిథిగా హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు కొనసాగిన క్యాంప్‌లో డయాబెటీస్, బీపీ, కీళ్ల నొప్పులు, దంత, నేత్ర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేసినట్లు సొసైటీ అధ్యక్షుడు విజయ్‌కుమార్ తెలిపారు. ఈ శిబిరంలో సొసైటీ సభ్యులు దేవి, ఝాన్సీ, సుభాష్, అరుణ్, సాత్విక, విఠల్‌రాజ్, సహస్ర, నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా భవన్ నిర్మాణ పనులకు భూమి పూజ



భూమి పూజ చేస్తున్న కార్పొరేటర్ తదితరులు

సుభాష్‌నగర్: మహిళల ఆర్థిక స్వావలంబన సాధించేందుకు మహిళా భవన్‌లు దోహద పడతాయని సూరారం కార్పొరేటర్ సత్యనారాయణ అన్నారు. సోమవారం న్యూ శివాలయనగర్‌లో నూతనంగా నిర్మించబోయే మహిళా భవన్ నిర్మాణ పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక మహిళల సమావేశాలకు, కుట్టు శిక్షణ ఇతర కార్యక్రమాలకు చేపట్టేందుకు మహిళ భవన్ ఉపయోగపడుతుందన్నారు. మహేశ్వర్ రెడ్డి, నరసింహారెడ్డి, చిట్టి షైనాజ్, కవిత తదితరులు పాల్గొన్నారు.

కృష్ణుడి అల్లరి.. గోపికల సందడి

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు • ఆలయాల్లో ప్రత్యేక పూజలు
కృష్ణుడి, గోపికల వేషధారణల్లో అలరించిన చిన్నారులు



వేషధారణలో చిన్నారులు మెంచు అద్విక, అద్వైత్ రామ్





హరేకృష్ణ.. హరేకృష్ణ.. కృష్ణ కృష్ణ హరే హరే... అంటూ పరిసర ప్రాంతాలు కృష్ణ నామస్మరణతో మారుమ్రోగాయి. నియోజకవర్గంలోని వివిధ డివిజన్లు, కాలనీల్లో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను కనుల పండువగా నిర్వహించారు. చిన్నారులు రాధాకృష్ణ, గోపికల వేషధారణలో సందడి చేశారు. ఆలయాల్లో స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా డివిజన్‌లలో ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

–కూకట్‌పల్లి జోన్‌బృందం





ఓల్డ్‌బోయిన్‌పల్లి రెయిన్‌బో కాన్సెప్ట్ హైస్కూల్‌లో రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు



ఇస్కాన్ ఆలయంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ తదితరులు



ఎస్ఎస్‌డీ గ్రామర్ హైస్కూల్‌లో..



కమల ప్రసన్న నగర్‌లో ..

నేడు భవిష్య నిధి అదాలత్

మూసాపేట: కూకట్‌పల్లిలోని ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం భవిష్యనిధి అదాలత్ నిర్వహించనున్నట్లు పీఎఫ్ కమిషనర్ డా.హేమంత్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని ఆర్‌టీసీ బస్ టెర్మినల్‌లో రెండవ అంతస్తులోని పీఎఫ్ కార్యాలయంలో, మేడ్చల్ ఇండస్ట్రియల్ ఏరియాలోని రానే ఇంజిన్ వాల్వ్ కంపెనీలో, మాదాపూర్‌లోని కాపస్టన్ సర్వీస్ లిమిటెడ్ కంపెనీలో అదాలత్ ఉంటుందని ఆయన తెలిపారు. ఖాతాదారులు తమ సమస్యలు పరిష్కరించుకోవడమే కాకుండా వారి సలహాలు, సూచనలు స్వీకరిస్తామని తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మూసాపేట డివిజన్‌కు చెందిన కార్తీక్‌కు రూ.2 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబిహాబేగం

మోతీనగర్: వివిధ కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని కార్పొరేటర్ సబిహాబేగం అన్నారు. కొన్ని రోజుల నుంచి కొత్తూరు సీతయ్య నగర్‌లో భూగర్భ డ్రైనేజీ పొంగిపొర్లడంతో ప్రజలకు రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఈ విషయాన్ని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆమె వెంటనే స్పందించి సోమవారం డ్రైనేజీని పారిశుధ్య సిబ్బందిచే శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఏ సమస్య ఉన్నా తనకైనా, సంబంధిత అధికారులకైనా సమాచారం అందజేస్తే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అబ్దుల్‌రజాక్, ఆర్.శివ, యోగిరాజ్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవరాత్రులు ప్రశాంతంగా జరుపుకోవాలి



సమావేశానికి హాజరైన మండప నిర్వాహకులు



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్‌రావు

- దీజేలకు అనుమతి లేదు
- బలవంతపు చందాలు వసూలు చేస్తే చర్యలు
- కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస్‌రావు

మూసాపేట: పోలీసులకు సహకరిస్తూ వినాయక నవరాత్రులను ప్రశాంతంగా జరుపుకోవాలని కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస్‌రావు అన్నారు. సోమవారం కూకట్‌పల్లి ఎన్‌కేఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌లో శాంతి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయక విగ్రహాల ప్రతిష్ఠాపనకు ముందు పోలీసులకు సమాచారం అందించాలని, తద్వారా జియోట్యాగ్ చేసి ఏ సమస్య వచ్చినా వెంటనే ఆ ప్రదేశానికి చేరుకోవటానికి పోలీసులకు వీలు ఉంటుందని వివరించారు. నిమజ్జనం వరకు మండప నిర్వాహకులు, భక్తులు సహకరించాలని కోరారు. నిమజ్జనం రోజు చెత్తను చెరువులో వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిమజ్జనం సందర్భంగా డీజేలకు అనుమతి లేదని, లా అండ్ ఆర్డర్‌కు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. నిమజ్జన సమయంలో వాలంటీర్‌ల కోసం భక్తులు పోలీస్‌స్టేషన్ వద్ద రిజిస్ట్రేషన్ చేసుకుంటే వారికి టీషర్ట్, ఐడీ కార్డు ఇస్తామని తెలిపారు. మండపాల వద్ద ప్రతి రోజు కమిటీ సభ్యులు కాపలా ఉండాలని, రాత్రి పది తర్వాత లౌడ్ స్పీకర్ వాడటానికి అనుమతి లేదన్నారు. విద్యుత్ వినియోగంలో అధికారుల నిబంధనలు పాటించాలన్నారు. బలవంతపు చందాలు వసూలు చేయవద్దని, ఎవరైనా చేస్తే డయల్ 100కి ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. విగ్రహం సైజు, బరువు, ఎన్ని రోజులకు నిమజ్జనం చేస్తారో తదితర విషయాలను కమిటీ సభ్యులు పోలీసులకు తెలియజేయాలన్నారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు మున్సిపల్, ఎలక్ట్రికల్, వాటర్, ట్రాఫిక్ ఇతర శాఖల అధికారులతో సమావేశం ఉంటుందని తెలిపారు. సమావేశంలో కూకట్‌పల్లి ట్రాఫిక్ ఏసీపీ వెంకటయ్య, సీఐ కె. ముత్తు, ట్రాఫిక్ సీఐ ముత్తు యాదవ్, కేపీహెచ్‌బీ ట్రాఫిక్ సీఐ వెంకటేష్, సబ్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ వెంకట్‌రెడ్డి

మండపాలకు అనుమతి తప్పనిసరి

మోతీనగర్: వినాయక మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి అని అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ సీఐ సామల వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం అల్లాపూర్ డివిజన్ పర్వత్‌నగర్ మినీ ఫంక్షన్ హాల్‌లో శాంతి సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని కులాలు, మతాలు కలిసి మెలిసి పండుగలు జరుపుకోవాలని సూచించారు. ప్రతి మండపం వద్ద రాత్రి పోలీసులతో పాటు నిర్వాహకుల గస్తీ ఉండాలని సూచించారు. ఈ నెల 27 నుంచి సెప్టెంబర్ 6వ తేదీ లోగా మండపాలకు అనుమతి పొందాలని సూచించారు. మండపాల వద్ద ప్రశాంత వాతావరణం ఉండే విధంగా నిర్వాహకులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మహ్మద్ జై బాబా, కొండమ్మ, శ్రీనివాస్ రెడ్డి, బొల్లు శ్రీనివాస్‌రావు, విజయ్ కుమార్ గౌడ్, సంజీవరెడ్డి, రవి, ఆదినారాయణ, సందీప్ కుమార్, కమ్మరి రామకృష్ణ, సతీష్ రెడ్డి, వివిధ బస్తీల, కాలనీల సంక్షేమ సంఘాల అధ్యక్షులు, నాయకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హైడ్రా భేష్.. నాలాలపై దృష్టి సారించాలి

- నోడల్ ఆఫీసర్, స్థానిక ప్రజాప్రతినిధితో కమిటీ ఏర్పాటు చేయాలి
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కూకట్‌పల్లి: హైడ్రా ఏర్పాటును స్వాగతిస్తున్నామని, నాలాల ఆక్రమణలపై సైతం దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. చెరువుల సంరక్షణకు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఉన్న నిర్మాణాలు తొలగించటమే కాకుండా నగరంలో అనేకమంది కేవలం భవనానికి, స్థలానికి అనుమతులు ఉన్నాయా, లేవా అని ఇళ్లు కొనుగోలు చేశారన్నారు. అవి చెరువు ఆక్రమణలో ఉన్నట్లు ఇప్పుడు కూల్చి వేస్తున్నారని, ఇళ్లను కొనుగోలు చేసిన వారిలో పేద, మధ్య తరగతి, ఉద్యోగస్తులు సైతం ఉన్నారన్నారు. వారికి ప్రభుత్వం ఏ విధంగా న్యాయం చేస్తుందని ప్రశ్నించారు. కూకట్‌పల్లి మైసమ్మ చెరువులో ఉన్న శ్మశాన వాటికకు, 40 ఏళ్లుగా ఉన్న మందిరానికి సైతం అధికారులు నోటీసులు అందజేయటం శోచనీయమని అన్నారు. మైసమ్మ చెరువులో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు పట్టాలు అందజేయడంతో రాజీవ్‌గాంధీ నగర్ అనే బస్తీ పేరిట ఇళ్లను నిర్మించుకున్నారని, ఇప్పుడు వారి పరిస్థితి ఏమవుతుందని ప్రశ్నించారు. చెరువుల పరిరక్షణకు ఓ నోడల్ ఆఫీసర్, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి కమిటీలు ఏర్పాటు చేసి తదుపరి చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కార్పొరేటర్ సబిహా బేగం



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: కాలనీల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ సబిహాబేగం అన్నారు. అల్లాపూర్ డివిజన్ ఆర్‌కే సొసైటీ ఇండోర్ స్టేడియం ఆవరణలో సోమవారం ఈఎన్‌టీ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. సమాజ హితం కోసం చేస్తున్న సేవలు వెలకట్టలేనివన్నారు. వైద్యుల సూచనల మేరకు ముందస్తు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సుభాన్, చాంద్ పాషా, రవీందర్‌రెడ్డి, సంజీవరెడ్డి, విజయకుమార్ గౌడ్, యోగిరాజ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నూతన కార్యవర్గం



ఎమ్మెల్యే గాంధీతో శ్రీచక్రధరి కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని శ్రీ చక్రధరి నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు సోమవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని కలిశారు. నూతన కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్యే సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాలనీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని తెలిపారు. కాలనీలోని వివిధ సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో శ్రీచక్రధరి కాలనీ ప్రెసిడెంట్ వెంకటేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసాద్‌రావు, జనరల్ సెక్రటరీ శ్రీకాంత్, ట్రెజరర్ శ్రీనివాస్, కమిటీ మెంబర్లు రామేశ్వరరావు, రమేష్, శ్రీధర్‌రెడ్డి, చిన్న శివయ్య, శ్రీనివాస్, కాలనీవాసులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం

కుత్బుల్లాపూర్: మతిస్థిమితం సరిగా లేని వ్యక్తి తప్పిపోయిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కొంపల్లి పోచమ్మగడ్డకు చెందిన కె.లింగం(35) ఈ నెల 23న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతని కోసం కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతికినా జాడ తెలియరాలేదు. లింగం మానసిక స్థితి సరిగా లేదని అతని కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హైస్కూల్‌లో చోరీ

చింతల్: చింతల్ డివిజన్ పరిధిలోని నెహ్రూ నగర్ హైస్కూల్‌లో ఆదివారం రాత్రి దొంగలు పడ్డారు. పాఠశాల కార్యాలయంతో పాటు తరగతి గదుల్లో విలువైన విద్యుత్ వైర్లను తస్కరించారు. ఈ పాఠశాలలో సుమారు 15 రోజుల పరిధిలోని రెండవసారి దొంగలు పడడం పాఠశాల సిబ్బందికి ఆశ్చర్యాన్ని కలిగించింది. పాఠశాల చుట్టూ నివాస గృహాలు ఉన్న పాఠశాలలో దొంగతనం జరగడం గమనార్హం. కాగా పాఠశాల హెచ్ఎం జెమినీ జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ తమ సిబ్బందితో వచ్చి పాఠశాలలను దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు.

నేడు బాచుపల్లిలో వాలీబాల్ టోర్నమెంట్

నిజాంపేట్: బాలానగర్ డీసీపీ జోనల్ లెవెల్ వాలీబాల్ టోర్నమెంట్‌ను మంగళవారం బాచుపల్లిలోని గోకరాజు రంగరాజు ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు బాచుపల్లి ఇన్‌స్పెక్టర్ ఉపేందర్ ఓ ప్రకటనలో తెలిపారు. మహిళలు, పురుషులకు విడివిడిగా జరిగే పోటీల్లో మొత్తం 40 జట్లు పోటీ పడనున్నాయని, ఉదయం 9 గంటలకు టోర్నమెంట్‌ను డీసీపీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారని ఆయన తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలు, బస్తీలకు చెందిన ప్రజలు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొవచ్చారు. దీనిపై స్పందించిన ఆయన పలు శాఖల అధికారులకు ఫోన్ చేసి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అదే విధంగా పలువురు శుభకార్యాలయ ఆహ్వాన పత్రికలను అందజేశారు.

మనూలో వర్క్‌షాప్ ప్రారంభం



వర్క్‌షాప్‌లో పాల్గొన్న అతిథులు

రాయదుర్గం: సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని కమిషన్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ టెక్నికల్ టెర్మినాలజీ (సీఎస్‌టీటీ)అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ షాజాద్ అన్సారీ పేర్కొన్నారు. మనూ పొలిటికల్ సైన్స్ విభాగంలో కేంద్ర విద్యాశాఖ సీఎస్‌టీటీ సహకారంతో ఉర్దూ, తెలుగులో ద్విభాషా అభ్యాసకుల గ్లాసరీ ఆఫ్ పొలిటికల్ సైన్స్ అభివృద్ధిపై ఐదు రోజుల వర్క్‌షాప్‌ను సోమవారం ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో డాక్టర్ షాజాద్ అన్సారీ మాట్లాడారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు ఏ నాగేశ్వరరావు, డాక్టర్ ఖుర్షీద్‌ఆలమ్ ప్రసంగించారు. కార్యక్రమంలో కేంద్ర,రాష్ట్ర విశ్వవిద్యాలయాలకు చెందిన నిపుణులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పోటీల్లో తెలంగాణకు అంతర్జాతీయ గుర్తింపు తేవాలి



ధన్‌రాజ్ యాదవ్‌ను కలిసిన స్విమ్మర్ సిద్ధార్థ్ కలియా

నిజాంపేట్: స్విమ్మింగ్ పోటీల్లో రాణించి తెలంగాణకు అంతర్జాతీయ గుర్తింపు తేవాలని నిజాంపేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్ అన్నారు. దుండిగల్ మున్సిపల్ ధర్మారెడ్డి కాలనీకి చెందిన సిద్ధార్థ్ కలియా దాయిలాండ్ ఫిఫకాట్‌లో ప్రపంచ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ అండర్–14 విభాగానికి ఎంపికయ్యాడు. సోమవారం సిద్ధార్థ్ నిజాంపేట్‌లో ధన్‌రాజ్‌యాదవ్‌ను మార్యదపూర్వకంగా కలిశాడు. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచి దేశానికి, రాష్ట్రానికి మంచి పేరు తేవాలని ఆయన కోరారు. తెలంగాణ దినేష్ రాజోరియా స్విమ్మింగ్ జనరల్ సెక్రటరీ, ట్రైనర్ విజయ్ సింగ్ ఉన్నారు.

గ్రామీణ విద్యార్థులకు 'నవోదయం'



జేఎన్‌వీలో 6 నుంచి 12వ తరగతి వరకు నాణ్యమైన విద్య



రాయదుర్గం: నిరుపేద గ్రామీణ, పట్టణ ప్రాంత విద్యార్థులకు జవహర్ నవోదయ విద్యాలయం ఒక వరం లాంటిది. జేఎన్‌వీలో ప్రవేశం పొందితే 6 నుంచి 12వ తరగతి వరకు ఉచితంగా, నాణ్యమైన విద్య అందుతుంది. చదువుతోపాటు ఇతర రంగాలలో కూడా రాణించేలా ప్రోత్సహిస్తారు. దేశవ్యాప్తంగా జిల్లాకు ఒకటి చొప్పున జేఎన్‌వీలు న్నాయి. శేరిలింగంపల్లి పరిధి గోపన్‌పల్లిలోని రంగారెడ్డి జిల్లాకు సంబంధించిన జేఎన్‌వీ 30 ఎకరాలలో ఉంది. ఐతే నేడు రంగారెడ్డి జిల్లాతో పాటు వికారాబాద్, మేడ్చల్ జిల్లాలు కొత్తగా ఏర్పాటు చేయబడ్డాయి. ఆయా జిల్లాలకు కూడా ఈ కేంద్రమే కొనసాగుతోంది. దీంతో మూడు జిల్లాల విద్యార్థులకు సీట్లు సరిపోవడం లేదని అంటున్నారు. కాగా 6వ తరగతిలో చేరేందుకు ప్రవేశ పరీక్ష దరఖాస్తునకు సెప్టెంబర్ 16 చివరి తేదీ కాగా జనవరి 18– 2025న ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

అర్హతలు.. ప్రవేశ పరీక్ష.. చివరి తేదీ.. సీట్లు

- జేఎన్‌వీలో 2025–26 ఏడాదికి 6వ తరగతిలో 80 సీట్ల కోసం అర్హత పరీక్ష నిర్వహిస్తారు.
- ప్రస్తుతం ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 5వ తరగతి చదివే వారు అర్హులు.
- దరఖాస్తునకు సెప్టెంబర్ 16 ఆఖరు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. జనవరి 18న ఎంట్రన్స్ టెస్ట్
- గ్రామీణ ప్రాంత విద్యార్థులు రిజర్వేషన్ పొందాలంటే 3 ,4, 5 తరగతులు గ్రామీణ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యాసంస్థల్లో చదివి ఉండాలి.
- జేఎన్‌వీలో అధునాతన తరగతి గదులు, క్రీడామైదానం, కంప్యూటర్ బోధన, స్మార్ట్ ల్యాబ్స్ ఉన్నాయి. 6 నుంచి 12వ తరగతి వరకు కో ఎడ్యుకేషన్ ఉండగా బాలబాలికలకు వేర్వేరుగా వసతి ఉంది.

ప్రవేశ పరీక్షా విధానం

జేఎన్‌వీ 6తరగతి అర్హత పరీక్షకు ఆబ్జెక్టివ్ టైప్ క్వశ్చన్స్ మొత్తం 80 ప్రశ్నలకు 100 మార్కులు. ఇందులో మేధాశక్తి (మెంటల్ ఎబిలిటీ), గణితం (అర్థమెటిక్స్), భాషా పరిజ్ఞానం(లాంగ్వేజ్) ఉంటుంది. పరీక్షా సమయం 2 గంటలు ఉంటుంది.

జేఎన్‌వీలో రిజర్వేషన్ విధానం

ప్రస్తుత రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో 75 శాతం సీట్లు గ్రామీణ విద్యార్థులకు, 25 శాతం సీట్లు పట్టణ ప్రాంత విద్యార్థులతో భర్తీ చేస్తారు.

- ఎస్సీలకు 15 శాతం , ఎస్టీలకు 7.5 శాతం , ఓబీసీలకు 27శాతం, బాలికలకు 1/3 వంతు సీట్లు, దివ్యాంగులకు 3 శాతం రిజర్వేషన్ కల్పిస్తారు.

ఆధునిక సౌకర్యాలు.. క్రీడల్లో ప్రత్యేక శిక్షణ



హైదరాబాద్ రీజియన్‌లో 77 జేఎన్‌వీలున్నాయి. వాటిల్లో అత్యాధునిక సౌకర్యాలు, నాణ్యమైన విద్య, క్రీడల్లో రాణించేలా ప్రత్యేక శిక్షణ ఉంటుంది. 6వ తరగతిలో చేరేందుకు ప్రవేశ పరీక్షకు దరఖాస్తుకు సెప్టెంబర్ 16 ఆఖరు. ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ పరీక్ష నిర్వహణకు ఒక్కొక్కరిపై వెయ్యి రూపాయల వ్యయం అవుతుంది. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. – గోపాలకృష్ణ, డిప్యూటీ కమిషనర్, నవోదయ విద్యాలయ సమితి, హైదరాబాద్ రీజియన్